ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

3★ గురువారం 7 మార్చి 2024

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం : సీఎండీ 6లో..

సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలి 6లో..



అత్యవసర వైద్య సేవలు అందేదెన్నడో?

- సెలవు దినాల్లో అందుబాటులో ఉండని వైద్యులు
- కరీంనగర్, వరంగల్ ఎంజీఎంకు రెఫరల్
- వినియోగంలోకి రాని వెంటిలేటర్లు
- ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులు

కళ్యాణ్‌నగర్, మార్చి 6: గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో రోగులకు వైద్యం అంద డం లేదు. వందల సంఖ్యలో వైద్యులు, సిబ్బంది ఉన్నా అత్యవసర కేసులన్నీ కరీంనగర్ ప్రభుత్వాసుపత్రి, వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. రోజుకు సుమారు 10 నుంచి 15 కేసుల ను కరీంనగర్, వరంగల్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ ఆధునిక సౌకర్యాలు లేవంటూ కొంతమంది వైద్యులు చేతులెత్తేస్తున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 332పడకలుగా అప్‌గ్రేడ్ అయిన తరువాత రోజుకు 800మంది నుంచి 1000 మంది వరకు ఇతర ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తున్నారు. మంచిర్యాల జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన కోటపల్లి, చెన్నూరు,ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారంతో పాటు భూపాలపల్లి జిల్లాలోని మహదేవాపూర్, పంకెన, పలిమెల, సూరారం, మహా ముత్తారం, తాడిచర్ల, కొయ్యూరు, కాటారం వంటి ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడి ఆసుపత్రికి వస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో వైద్య విభాగా లు అందుబాటులోకి రాలేదు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, ప్రిడియార్టిక్, ఐకేర్, ఈఎన్‌టీ, సైకాలజిస్ట్, చెస్ట్, జనరల్ సర్జికల్ మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. ఇంకా చాలా విభాగాలు అందుబాటులోకి రావాల్సి ఉండగా వాటిపై ఇప్పటివరకు ఎలంటి దృష్టి సారించడం లేదు.

● వెంటిలేటర్లు వచ్చినా..

అత్యవసర సమయంలో రోగి ప్రాణాలు కాపాడే వెంటిలేటర్లు వచ్చినప్పటికీ ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకరాలేదు. రెండు నెలల క్రితం పది వెంటి లేటర్లు వచ్చినా ఇన్‌స్టాల్ చేయడానికి టెక్నీషియన్లు లేకపోవడంతో వాటిని గోడౌన్‌కే పరిమితం చేశారు. ఆసుపత్రిలోఐసీయూ కేంద్రంలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

● న్యూరో, కార్డియో విభాగం లేక..

రామగుండం పారిశ్రామికప్రాంతంలో వాతావరణ కాలుష్యం, విషవాయువులతో చాలామంది పక్షవాతం, గుండెపోటుకు గురవుతు న్నారు. సింగరేణి ప్రాంతం కావడంతో భూగర్భంలో మైళ్లకొద్ది నడిచి నరాల వ్యాధులకు గురవుతున్నారు. ఇందులో పక్షవాతానికి గురై సకాలంలో వైద్యం అందక కాళ్లు, చేతులు పడిపోయి మంచానికే పరిమితమైన వారు చాలా మంది ఉన్నారు. అదేవిధంగా గుండెపోటు వస్తే కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ ఇప్పటివరకు కార్డియో విభాగం లేకపోవడం తో 60కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్‌కు వెళ్లే సరికి రోగికి తీవ్ర నష్టం లేదా ప్రాణాలు కోల్పోతున్నా రు. ఇక్కడ ఈ రెండు విభాగాలు అతి ముఖ్యమైనవి. ఈ రెండు విభాగాలను ఏర్పాటు చేయాలని పలు మార్లు ఇక్కడి నాయకులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో రోగులను కరీంనగర్, హైదరాబాద్ వం టి ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి ఈప్రాంతవాసులు లక్షలకు లక్షలు ధారబోస్తూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

సెలవు దినాల్లో ఇబ్బందులు..

సెలవు దినాలు వస్తే ఆసుపత్రిలో వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రోడ్డు ప్రమాదాలు, అత్యవసర కేసులు వస్తే డాక్టర్ల కోసం రోగి బంధువులు ఆసుపత్రి అంతా వెతకాల్సిన పరిస్థితి. 24గంటలు డ్యూటీలో డాక్టర్లు ఉండాల్సి ఉం డగా కేవలం నర్సింగ్ సిబ్బందితోనే నరిపెట్టుకుంటు న్నారు. పండుగ, ఇతర సెలవుదినాల్లో అసలు ఆసుపత్రికి వైద్యులు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు షిఫ్టుల్లో డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉండాల్సి ఉండగా నామ మాత్రంగా వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. కొంత మంది వైద్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మధ్యాహ్నం 12గంటల వరకు విధులు నిర్వహించి ఆ తర్వాత వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చాలా మంది వైద్యులు ఇక్కడ వైద్యం అందించాల్సి ఉండగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.

ఉద్యోగులు ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించాలి : కలెక్టర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోజువారీ జీవన శైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే మన ఆరోగ్యంపై ప్రభావం చూపి మంచి ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జీవన శైలిలో చేసుకోవాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన ఆహారపు పదార్థాలపై ఉద్యోగులకు కరీంనగర్‌కు చెందిన న్యూట్రిషన్ డాక్టర్ రజితచే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యంపై సైతం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని, ఉద్యోగులు అనవసరపు ఒత్తిడికి గురికాకుండా విధులు నిర్వహించాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఉద్యోగులకు నిర్వహించిన వైద్య పరీక్షల ఫలితాలు వారికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లో పనిచేసే వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లికార్జున స్వామి కల్యాణం



మాంగళ్యధారణ నిర్వహిస్తున్న అర్చకుడు

ఓదెల, మార్చి 6 : మండల కేంద్రంలోని బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణాన్ని అర్చకులు కన్నుల పండుగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సతీమణి పావని నూతన వధూవరులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణదాతలు, భక్తుల కరతాళ ధనుల మధ్య, అర్చకుల వేదమంత్రాల సాక్షిగా స్వామివారి కల్యాణ మహోత్సవ తంతును నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కత్తెరశాల మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని కత్తెరశాల మల్లన్నను బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దర్శించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కందుల సదాశివు, చోప్పరి రాజన్న, మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

టీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల్లో 10శాతం రాయితీ

కళ్యాణ్‌నగర్, మార్చి 6: టీఎస్ ఆర్టీసీ సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం లహరి ఏసీ, స్లీపర్ కం సీటర్ బస్సుల్లో బెర్త్‌లపై 10శాతం రాయితీ కల్పించనున్నట్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం చెప్పారు. సాధారణ టికెట్ ధరలో ప్రయాణికులు బుక్ చేసుకున్న బెర్త్‌లపై 10శాతం రాయితీ కల్పించినట్లు, ఈ సౌకర్యం ఏప్రిల్ 30వరకు ఉంటుందని తెలిపారు. లహరి ఏసీ స్లీపర్ బస్సు హైదరాబాద్ నుంచి చెన్నై, విశాఖపట్నం, బెంగుళూరు, ఏసీ స్లీపర్ కం సీటర్ సర్వీసు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్‌కు, గోదావరిఖని నుంచి బెంగుళూరు, కరీంనగర్ నుంచి బెంగుళూరు, నిజామాబాద్ నుంచి తిరుపతి, నిజామాబాద్ నుంచి బెంగుళూరు, వరంగల్ నుంచి బెంగుళూరు మధ్య ఈ రాయితీ ఉంటుందని తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు పని కల్పించాలి : డీఆర్‌డీవో



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

సుల్తానాబాద్, మార్చి 6: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీ పనులు చేస్తున్న వారికి వంద రోజులు నిండేలా పని కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ ఉపాధిహామీ అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని కుందేళ్ల కుంట చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వారికి వస్తున్న వేతనం గురించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మార్చి చివరి వరకు కూలీలకు వంద రోజులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, వేసవి దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి వసతితో పాటు నీడను కల్పించాలని సూచించారు. జూలైలో నిర్వహించే హరితహారం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వెంట ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో మల్లీశ్వరి, కార్యదర్శి ప్రశాంత్, ఈసి, టీఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

జూలపల్లి, మార్చి 6 : మండలంలోని కాచాపూర్ ప్రభుత్వ అప్పర్‌ప్రైమరీ పాఠశాలను బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌లో సాగుచేస్తున్న కూరగాయ పంటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి వ్యక్తం చేశారు. మహిళలు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రచికరమైన భోజనం తయారుచేస్తున్న మధ్యాహ్న భోజనం వర్కర్లను ఈసందర్భంగా కలెక్టర్ అభినందిస్తూ వారికి నగదు పారితోషికాన్ని అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించగా విజేతలకు బహుమతులను అందజేశారు. డీఈవో మాధవి, పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిఎం షేక్, మండలపరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ, పంచాయతీ కార్యదర్శి శరత్, మాజీ సర్పంచ్ ఆకుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయాధికారి

సుల్తానాబాద్, మార్చి 6: రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కాట్నపల్లి రైతు వేదిక వద్ద బుధవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన రైతు నేస్తంను ఆయన ప్రారంభించారు. విజయరమణారావు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, జడ్పీటీసీ మినుపాల స్వరూపరాణిప్రకాష్‌రావు, కాల్వశ్రీరాంపూర్ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, కాట్నపల్లి ఎంపీటీసీ అనిత తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : పాలకుర్తి రైతు వేదికలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, కన్నాల పీఏసీఎస్ చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ ఎర్రం స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకే ఏకరూప దుస్తులు

- జూన్ 1వ తేదీ నాటికి పాఠశాలలకు చేర్చాలని ప్రభుత్వ ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ పాఠశాలలు, ఇతర గురుకుల విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఇచ్చే ఏకరూప దుస్తుల కుట్టే బాధ్యతను స్వశక్తి సంఘాల మహిళలకే అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ బాధ్యతను రెండేళ్ల నుంచి వారికే అప్పగించాలని చెబుతున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాది నుంచి తప్పనిసరిగా దుస్తులను మహిళా సంఘాలతోనే కుట్టించాలని ప్రభుత్వం పేర్కొంది. దీనికి సంబంధించి పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షా ద్వారా నిధులను కూడా విడుదల చేసింది. ప్రభుత్వం పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థుల మధ్య తరతమ భేదాలు లేకుండా చూసేందుకు ఏకరూప దుస్తులనే వాడాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలల్లోనే గాకుండా ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ఏక రూప దుస్తులను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలతో పాటు రెండు జతల ఏకరూప దుస్తులు, నోట్ బుక్కులు అందజేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఏటా పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఏకరూప దుస్తులను సిద్ధంగా ఉంచుతారు. విద్యార్థుల సంఖ్యను బట్టి టెస్కో ద్వారా దుస్తులకు కావాల్సిన బట్టను సరఫరా చేస్తారు. దుస్తులను కుట్టేందుకు ఆయా ఏజెన్సీలకు అప్పగిస్తూ వస్తున్నారు. అయితే ఈసారి తప్పరిసరిగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా సంఘాలకే కుట్టు బాధ్యత అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో జతకు 50 రూపాయల చొప్పున రెండు జతలకు 100 రూపాయలు ఇస్తారు. ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలో బట్టలు కుట్టే మహిళా సంఘాలను గుర్తించాలని పేర్కొన్నారు. వారికి సమీపంలోని పాఠశాలలను కేటాయించాలన్నారు. తదనంతరం ఈనెలాఖరు వరకు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకుని ఆమేరకు బట్టలు కుట్టి జూన్ 1వ తేదీ నాటికి అప్పగించాలని ఆదేశించారు. జిల్లాలో 559 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 10 కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాలు, 7 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 16,417 మంది బాలురు, 18,002 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి రెండు దుస్తుల చొప్పున 32,834 డ్రెస్సులు బాలురకు, 36,004 డ్రెస్సులు బాలికలకు అందజేయాలి. ఈ దుస్తులు కుట్టించేందుకు ప్రభుత్వం 34 లక్షల 41 వేల 900 రూపాయల నిధులను కేటాయించింది.

● బాలికలకు వేర్వేరు డిజైన్లు..

గతంలో బాలబాలికలకు ఒకే రకమైన దుస్తులను అందించేవాళ్లు. ఈసారి పలురకాల దుస్తులను కుట్టించాలని పేర్కొన్నారు. 1 నుంచి 3వ తరగతి చదివే బాలికలకు ఒక డిజైన్, 4 నుంచి 5వ తరగతి చదివే బాలికలకు చొక్కా, స్కర్టు, 6నుంచి ఇంటర్ చదివే బాలికలకు పంజాబీ డ్రెస్, 1 నుంచి ఇంటర్ చదివే బాలురకు చొక్కా, ప్యాంట్, నిక్కర్ కుట్టించాలని, వాటికి అదనంగా జేబులు, పట్టీలు పెట్టాలని ఆదేశించారు. ఈ ఏకరూప దుస్తులు కుట్టేందుకు ఒక జతకు ఇస్తున్న 50రూపాయల చార్జీలు సరిపోవడంలేదని ఎన్నో ఏళ్లుగా మహిళలు, ఏజెన్సీలు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఒక జతకు కనీసం 200 రూపాయలు ఇస్తే గానీ గిట్టుబాటు కాదని అంటున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి చార్జీలను పెంచాలని మహిళలు కోరుతున్నారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలుచేయాలి బీఆర్ఎస్ నేతల ధర్నా



జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల నిరసన దీక్ష



ఖనిలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, మార్చి 6: ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఒక్క నిరసన దీక్ష చేపట్టారు. ఎంపీపీలు బండారు స్రవంతి, శ్రీనివాస్, తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, నూనేటి సంపత్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు మర్కు లక్ష్మణ్, నిదానపురం దేవయ్య, వెంకటరెడ్డి, పురం ప్రేమచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ : ఎన్నికల ముందు ఎల్ఆర్ఎస్ భూముల క్రమబద్ధీకరణ తదితర ఉచిత హామీలు ఇచ్చి మాటమార్చిన కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా బుధవారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజిని, నాయకులు బొడ్డుపెల్లి శ్రీనివాస్, తోట వేణు, నిజామోద్దీన్, పిల్లి రమేష్, తోకల రమేష్, నూతి తిరుపతి, అచ్చె వేణు, దొమ్మేటి వాసు, మెతుకు దేవరాజ్, అడ్లూరి రాములు, తిమోతి, కిరణ్‌జీ, అల్లం ఐలయ్య, గుర్రం పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మంథని : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. పోలీసులు వచ్చి ధర్నాను విరమింపజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నేతలు తగరం శంకర్‌లాల్, పోతిపెద్ది కిషన్‌రెడ్డి, జంజర్ల శేఖర్, లోడారి రాములు, ఆరెపల్లి కుమార్, మంథని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మంథనిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

మహిళా శక్తిని చాటిచెప్పేలా ప్రధాని మోదీ కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, మార్చి 6 : మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పేలా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కొనియాడారు. బీజేపీ చేపట్టిన నారీ శక్తి వందన్ అభియాన్‌లో భాగంగా బుధవారం మంథని పార్టీ ఆఫీస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, మహిళా మోర్చా నేతలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్ : బీజేపీ ప్రభుత్వం పదేళ్ళుగా చేసిన అభివృద్ధి, సంక్షేమంపై బుధవారం వర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారం చేశారు. స్థానిక అమర్‌చంద్ కళ్యాణ మండపంలో ప్రొజెక్టర్లు ఏర్పాటు చేసి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వరగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షీలార పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రూపురెడ్డి ఆదిరెడ్డి, నాయకులు పోల్సాని సంపత్‌రావు తోడుపునూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం

వేములవాడ రూరల్, మార్చి 6: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హన్మాజిపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో శ్రీనివాస్, చందుర్తి, జడ్పీటీసీ నాగం కుమార్, మండల పశు సంవర్ధక అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన

కొడిమ్యాల, మార్చి 6 :మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడు కెకె మహేందర్‌రెడ్డి పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను కొడిమ్యాల పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం కొడిమ్యాల ఎస్సై సందీప్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, సంఘం నాయకులు లక్ష్మన్, రాజుకుమార్, జనార్దన్, అశోక్, చిరంజీవి, యెస్వంత్, దేవెందర్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నరేంద్ర మోదీ సారథ్యంలో మహిళా సాధికారత

గొల్లపల్లి, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్ మహిళా సాధికారత వైపు దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల కృష్ణహరి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి ఆర్యవైశ్య సంఘం భవనంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పీఎం నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కన్వీనర్ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, ఈ నేపథ్యంలో విజయం సాధిస్తుందని అన్నారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.


నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా


నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు

నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశవ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)


ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించిననట్లు ఆరోపణలున్నాయి.

సంక్షిప్త సమాచారం

● కోల్‌సిటీటౌన్ : ఎస్ఎస్‌వీ గ్రూప్ పబ్లిషర్స్ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి మెగా హ్యాండ్ రైటింగ్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన కృష్ణవేణి విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఈమేరకు బుధవారం స్కూల్ ఆవరణలో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

● కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని ఎన్‌టీపీసీలోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సీఐ జె.కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. ప్రిన్సిపల్ యుగేందర్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

● మంథని : నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు టాస్క్, శ్రీపాద సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 10న మంథనిలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వేదాంతం పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. మేళాను మంథనిలోని శివకిరణ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

● పెద్దపల్లిటౌన్ : జర్నలిస్టులను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో వీడియోను వైరల్ చేసిన ఒక దళిత నాయకుడిపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రతినిధులు పెద్దపల్లి ఎస్ఐకి బుధవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీ : మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో పారిశుధ్య పనులను నిర్వహించడానికి రామగుండం నగరపాలక సంస్థ నుంచి బుధవారం పారిశుధ్య సిబ్బంది వెళ్లినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 10వరకు వేములవాడలో విధులు నిర్వహిస్తారని తెలిపారు.

● కళ్యాణ్‌నగర్ : మంత్రి పొన్నం ప్రభాకర్ ఆత్మీయ సత్కారాన్ని ఈనెల 10న నిర్వహించనున్నట్టు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ సంఘం నాయకులు మేరుగు హన్మంతుగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కోట రవి, వంగ శ్రీనివాస్, పొన్నం విజయ్‌కుమార్, బుగ్గ రాములుగౌడ్, అశోక్, కృష్ణ, గున్నాల శ్రీధర్, బండారి రవి పాల్గొన్నారు.

● జ్యోతినగర్: స్థానిక ఎల్కలపల్లిలో మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాకు చెందిన అక్షయ్ సదాశివ్ కుంబారే(35) అనే వలస కార్మికుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. గౌతమినగర్ ప్రాంతంలో బ్రిక్స్ తయారీ కేంద్రంలో పని చేస్తున్న అక్షయ్ తాగుడికి బానిసయ్యాడు. తాగిన మైకంలో ఉరివేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

● ధర్మారం : మండలంలోని నర్సింహులపల్లి, చింతలపల్లి గ్రామాల్లో మల్లన్న పట్నాలకార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, కాంగ్రెస్ నాయకులు అజయ్‌పాల్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ : మండలంలోని రొంపికుంటలోని హమాలీ భవనంలో క్రీడాపోటీల్లో గెలుపొందిన మహిళలకు తహసీల్దార్ హారిఫుద్దీన్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీవో ఉమేష్, మాజీ సర్పంచ్ కటకం రవీందర్, నాయకులు భద్రపు శంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ తదితరులు ఉన్నారు.

● కమాన్‌పూర్ : మండలకేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ జరిగినట్లు కరస్పాండెంట్ చదువు వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ రాజమణిలు తెలిపారు. మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ప్రారంభించారు.

● కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ రమేష్ తనిఖీ చేశారు. వెంట ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ బాలాజినాయక్ ఉన్నారు.

మహిళా సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలి

- ముందస్తు మహిళా దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

పెద్దపల్లిటౌన్, మార్చి 6: మహిళా సమానత్వం మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, మన ఇంట్లో కొడుకుతో సమానంగా కూతురును చూసినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ బుధవారం సాయిగార్డెన్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాల్లో మహిళలు రాణించాలన్నారు. 10వ వార్డు కౌన్సిలర్ మాధవితో పాటు మహిళలు పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్ : కలెక్టరేట్ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని టీఎన్‌జీఓస్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ,సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వప్న, అధికారులు, మహిళా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశలో సుల్తానాబాద్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రియాంక మాట్లాడారు. హెచ్ఎం విజయ్‌రావు, బార్ అధ్యక్షులు బాలకిషన్ ప్రసాద్, ఏజీపీ తిరుపతిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడారు. మహిళలు చేసి నృత్యాలు ఆకట్టుకున్నాయి. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్‌డీవో అరుణ, అర్చన వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కాగా, గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షురాలు కే జ్యోతి హాజరై మాట్లాడారు. మంగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఐ కృష్ణ, బుచ్చమ్మ, అమృత, పద్మ, శారద, కళ్యాణి, శంకరమ్మ, పుష్పలత, శివరంజిని, రూపశ్రీ, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ నారీ శక్తివందన్ కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం బీజేపీ మహిళా నాయకురాలు కందుల సంధ్యారాణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మెరుగు హన్మంత్‌గౌడ్, వడ్డెపల్లి రాంచందర్, పెద్దపల్లి రవీందర్, చంద్రశేఖర్, తోట కుమారస్వామి, జనార్ధన్, బాణాల స్వామి, రవిచరణ్, మహావాది రామన్న, నవీన్‌గౌడ్, పైతరి రాజు పాల్గొన్నారు.

కాగా, గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. బెస్ట్ ఇవికే అవార్డును కెస్వ రూపరాణి, పి.వనిత, పద్మావతి, లక్ష్మిలకు అందజేసి నగదు సత్కరించారు. డాక్టర్ లక్ష్మీవాణి, మహిళా కండక్టర్లు, ఉద్యోగులు గీతాకృష్ణ, ఎం.సంధ్యారాణి, అమృత, వలీమొహ్మద్, ఇంద్రదేవి, స్వామి పాల్గొన్నారు.

మంథని : నాబార్డ్ సౌజన్యంతో మంథని మండల సమైక్య ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం జరుపుకున్నారు. లాయర్ షబానాను, డాక్టర్ స్రవంతి, ఏపీఎం పద్మలను మహిళా సంఘాల వీవోఏలను సన్మానించారు. నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు



కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి

హజ్ కమిటీ సభ్యురాలిగా సనాఫక్రుద్దీన్



సనాఫక్రుద్దీన్

కళ్యాణ్‌నగర్, మార్చి 6: రాష్ట్ర హజ్ కమిటీ సభ్యురాలిగా గోదావరిఖనికి చెందిన 49వ డివిజన్ కార్పొరేటర్ సనా ఫక్రుద్దీన్‌ను నియమిస్తూ మైనార్టీ వెల్ఫేర్ సెక్రెటరీ సయ్యద్ ఒమిర్ జలీల్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకం కోసం కృషి చేసిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు సనా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. హజ్ కమిటీలో సనా ఫక్రుద్దీన్‌కు చోటు కల్పించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగలు తగిలి గొర్రెల కాపరి మృతి

ఓదెల, మార్చి 6 : అడవిపందుల నుంచి మొక్కజొన్న పంటను రక్షించుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తలిగి ఆబాద్ జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య(60) అనే గొర్రె లకాపరి మృతిచెందాడు. మండలంలోని జీలకుంటలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. రైతుల భూముల్లో గొర్రెల మందలు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్న కొమురయ్య తెల్లవారుజామున బహిర్భూమికి గ్రామానికి చెందిన బంగారి కొమురయ్యకు చెందిన మొక్కజొన్న పంట వైపు వెళ్లి విద్యుత్‌తీగలు తగిలి మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ అశోక్‌రెడ్డి సందర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పొల్సాని శశికళ

పాలకుర్తి,మార్చి 6: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ఎంపీటీసీలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పేరుకుపోయాయని విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమావేశం దృష్టికి పలువురు ఎంపీటీసీలు తీసుకవచ్చారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ ఎర్రం స్వామి, ఎంపీడీవో పొల్సాని శశికళ, సూపరింటెండెంట్ పూర్ణచందర్‌రావు, ఎంపీవో షబ్బీర్ పాషా, కన్నాల పీఏసీఎస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఎంపిటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జనగామ శివాలయంలో మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

కోల్‌సిటీటౌన్, మార్చి 6: గోదావరిఖని జనగామలోని త్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ మేరకు బుధవారం జనగామ శివాలయం ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్, ఆలయ కమిటీ చైర్మన్ జనగామ నారాయణ, ఆలయ అర్చకులు రుద్రభట్ల రమేష్‌శర్మ మాట్లాడారు. ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమై సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కల్యాణమహోత్సవం, లింగోద్భవ కార్యక్రమం, శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు, కరపత్రాలను మనాలీఠాకూర్ విడుదల చేశారు. కార్పొరేటర్లు జనగామ కవిత సరోజిని, దాతు శ్రీనివాస్, ఆలయ కమిటీ వైస్‌ప్రెసిడెంట్ జువ్వాడి మాధవరావు, ప్రధానకార్యదర్శి జనగామ శివ, కోశాధికారి చెలుకల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి, ఆలయ కమిటీ సభ్యులు

అమరేశ్వరస్వామి ఆలయం ముస్తాబు..

ధర్మారం, మార్చి6: మహాశివరాత్రి ఉత్సవాలకు ధర్మారం మండల నందిమేడారం అమరేశ్వరస్వామి ఆలయంను ముస్తాబు చేశారు. ఆలయం చుట్టు రంగులు వేశారు. విద్యుత్‌దీపాలంకరణ చేశారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఆలయం ముందు భక్తులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

కరపత్రాల ఆవిష్కరణ

రామగిరి, మార్చి 6: మండలంలోని కల్వచర్లలో ఉమామహేశ్వర దేవస్థానంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారు దేవుడు శివయ్యను దర్శించుకొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావాలని ఒడితల శ్రీనివాస్, తాటి రవీందర్‌గౌడ్ తదితరులు కోరారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

ధర్మారం, మార్చి6: ధర్మారం మండలం నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జడ్జి వెంకట సచిన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అకారి రాజేశం వాటర్ డిస్పెన్సర్‌ను బహుకరించగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అకారి రాజేశం, సంయుక్త కార్యదర్శి నూనే సత్యనారాయణ, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి భీమారపు సంపత్, కోశాధికారి ఎంపెల్లి ప్రకాష్, న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి, గణేష్, ఎన్ రజిత కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ బాలికల కోసం బాలసదన్ నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మార్చి 6: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలకు వసతి సౌకర్యాలు కల్పించి విద్యను అందించేందుకు బాల సదన్ భవనంను నిర్మించనున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద అంజనేయస్వామి ఆలయం ముందు ప్రభుత్వం కేటాయించిన ఎనిమిది గుంటల స్థలంలో కోటి ముప్పై నాలుగు లక్షలతో బాల సదన్ నిర్మించేందుకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, ఎంపీపీ బాలాజీ రావు, జడ్పీటీసీ స్వరూపప్రకాశ్ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, డీఈ విన్సెంట్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు శాస్త్రినగర్ ప్రాంతాలలో బుధవారం చైర్‌పర్సన్, మున్సిపల్ అధికారులు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వార్డులో మురికి కాలువలు, వీదులు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవల్లి తిరుపతి, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రావణ్, ఆనంద్ పాల్గొన్నారు.

నేత్ర దానం

కోల్‌సిటీటౌన్, మార్చి 6: అనారోగ్య సమస్యతో గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన కాశెట్టి రాజేశ్వరి(73) నేత్రాలను ఆమె కుమారులు రాము, శివ దానం చేశారు. జీజీహెచ్‌లోని ఎల్విప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ అజ్మీర్ లక్ష్మణ్‌కుమార్ ఆమె నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. నేత్రదాతకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, నూకా రమేష్, రామకృష్ణారెడ్డి, శంకర్, చంద్రమౌళి, కెఎస్ వాసు, భీష్మాచారి, అన్నపూర్ణ, శశికళ, శారదా, చంద్రశేఖర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి కుమార్, శ్యామ్‌సుందర్ అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముత్తారం, మార్చి 6: మండలంలోని అడవి శ్రీరాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఓడేడు ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 33కేవి లైను పై చెట్ల కొమ్మలు కొట్టివేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

రామగిరి, మార్చి6: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నరేందర్‌కు రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌కు సైతం డబ్బులు లేని విషయాన్ని గ్రామస్థులు కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.5వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బూసబాపన్న, జగన్, రాము, సూర్యం, రౌతు కిష్టయ్య, రాపెల్లి సత్తయ్య, కనకయ్య, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ బ్రోచర్ ఆవిష్కరణ

రామగిరి, మార్చి 6: జేఎన్టీయూ యూనివర్సిటీ పరిధిలోని బి జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను బుధవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. మార్చి 19 నుంచి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగే టోర్నమెంట్‌లో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జిల్లాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలల జట్లు పాల్గొంటున్నాయి. ఈకార్యక్రమంలో అధికారులు దుర్గారావ్, మూర్తి, రవి కుమార్, పింగిళి కృష్ణారెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

జూలపల్లి, మార్చి 6: జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామ శివారులో బుధవారం సాయంత్రం కెనాల్ పక్కన పేకాట ఆడుతున్న 10 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి 8500రూపాయలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

జూలపల్లి, మార్చి 6: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన భూతుకూరి సంపత్ అనే నిరుపేద వ్యక్తికి చెందిన భూమిలో అదే గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు జేకే శేకర్‌యాదవ్ అక్రమంగా తన తల్లిదండ్రుల సమాధులను ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపిస్తూ బుధవారం బాధిత కుటుంబ సభ్యులు నిర్మాణం వద్దని ఆందోళనకు దిగారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలు

పెద్దపల్లి రూరల్, మార్చి 6: మండలంలోని అందుగులపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఫేర్‌వెల్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్‌లో మంచిస్థానాన్ని పొందేందుకు చాలా కష్టపడాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ కారే శారద-శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామయ్య, మాజీ వార్డు సభ్యులు గౌస్, సత్యనారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో విద్యార్థులకు ఇక్కట్లు



ఓడెడ్‌కు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

ముత్తారం, మార్చి 6: ఇసుక లారీలతో సామాన్య ప్రజలు, బడి పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓడెడ్ ఇసుక క్వారీ కోసం సుమారు 400 లారీల బుకింగ్ ఉండడంతో ఓడేడులోని వెంకటేశ్వరపల్లి వద్ద పార్కింగ్ యార్డ్లో సుమారు 200 లారీలు ఉన్నప్పటికీ ఓడేడు నుంచి ముత్తారం మండల కేంద్రంలోని అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వరకు లారీలు రోడ్డుపై నిలిపివేసి ఉన్నాయి. దీంతో బుధవారం మధ్యాహ్నం ఓడేడుకు వెళ్లవలసిన ఆర్టీసీ బస్సు ఇసుక లారీల మధ్య ఇరుక్కొని సుమారు రెండు గంటల సమయం పట్టింది. ఓడేడుకు చేరుకునేందుకు సాయంత్రం మోడల్ స్కూల్ నుంచి ఓడేడు వరకు బడి పిల్లల బస్సు వెళ్ళవలసి ఉంటుంది. మధ్యాహ్నం జరిగిన సంఘటనతో ఆర్టీసీ డ్రైవర్లు ముందే అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలో వెంకటేశ్వరపల్లి ఓడేడ్‌కు వెళ్లవలసిన ప్రయాణికులను, విద్యార్థులను అడవి శ్రీరాంపూర్ చౌరస్తాలోనే దింపి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణికులు, బడి పిల్లలు నడకదారి పట్టారు.



స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, రామగిరి మార్చి 6: సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో ఇస్తున్న శిక్షణను ప్రభావిత ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్, తెలంగాణ స్టేట్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ సహకారంతో మొత్తం 38వృత్తి కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మందమర్రి ఏరియాలో బ్యాచ్‌కు 20మంది చొప్పున శిక్షణ ఇవ్వబడుతుందని, శ్రీరాంపూర్, రామగుండం రీజియన్‌లకు చెందిన 18-42ఏళ్ళ యువతీ, యువకులు అర్హులని జీఎం తెలిపారు. ఆసక్తిగల వారు సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు కాపీని స్థానిక ఎంవీటీసీలో అందజేయాలని జీఎంలు సూచించారు.

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం : సీఎండీ

గోదావరిఖని, మార్చి 6: సింగరేణి అభివృద్ధిలో కార్మికులతోపాటు అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని సంస్థ సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి స్థితిగతులను ఎప్పటికప్పుడు కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధికి మరింత అంకిత భావంతో పని చేయాలని ఆయన అధికారుల సంఘం నాయకులను కోరారు. బుధవారం సింగరేణి భవన్‌లో సింగరేణి అధికారుల సంఘం(కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నాయకులతో ఆయన మాట్లాడారు. పోటీ మార్కెట్‌లో సింగరేణి నిలదొక్కుకోవాలంటూ ఉత్పాదకత మరింత పెరగాలన్నారు. అందుకోసం అధికారులు, కార్మికులు పూర్తి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీఎండీ సంస్థ ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సంస్థను ప్రగతి పథంలో నడిపేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు సూచించాలని ఆయన అధికారులను కోరారు. మల్టీ డిపార్ట్‌మెంట్ టీములను మరింత పటిష్టం చేసి కార్మికులకు సంస్థ పరిస్థితులను కులంకుషంగా తెలియజేయాలని చెప్పారు. కంపెనీలో లాభాల్లో నడిస్తే కార్మికులతో పాటు అధికారులకు కూడా తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారుల సంఘం నూతన అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు సారధ్యంలో 12ఏరియాలకు చెందిన అధికారుల సంఘం కమిటీల నాయకులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు పొనగోటి శ్రీనివాస్, పీ రాజీవ్‌కుమార్, ఆర్ కిరణ్‌రాజ్‌కుమార్, సీహెచ్ రాజగోపాల్, ఈ నరేష్, బీ రాజగోపాల్‌తో పాటు అధికారుల సంఘం అన్నీ ఏరియాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

సైబర్ సెక్యూరిటీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని, మార్చి 6: సైబర్ సెక్యూరిటీ, సైబర్ హైజిన్ గురించి బుధవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడారు. అధికారులు ఆఫీస్ సిబ్బందితో సైబర్ సెక్యూరిటీ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జీఎం మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, సైబర్ హిజిన్ గురించి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి వ్యాప్తంగా 5వేలకు పైగా కంప్యూటర్లను వాడుతన్నామని, సుమారు 350 కిలోమీటర్ల దూరం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ విస్తరించి ఉందని ఆయన చెప్పారు. ఇంతటి విస్తృత కమ్యూనికేషన్ నెట్‌వర్క్ వ్యవస్థ ఉన్నప్పటికీ ఎక్కడ ఎలాంటి సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సమస్య తలెత్తకుండా ఐటీ విభాగం పని చేస్తున్నదన్నారు. పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని, ప్రతి రోజు సైబర్ నేరస్థుల చేతిలో ప్రజలు మోసాలకు గురవుతున్నారని శ్రీనివాస్ అన్నారు. ఇందుకు కారణం సైబర్ నెట్‌వర్క్‌పై అవగాహన లేకపోవడమేనని చెప్పారు. సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కంపెనీ విలువైన విషయాలను గానీ, వ్యక్తిగత నగదుకు సంబంధించిన డేటాను గోప్యంగా ఉంచాలని సూచించారు. సింగరేణిలో సైబర్ సెక్యూరిటీ, సైబర్ హైజిన్ అమలు పర్చడం ద్వారా సంస్థ వ్యాపారం కూడా పెరుగుతుందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా డీజీఎం(ఐటీ) కార్పొరేట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ సెక్యూరిటీ గురించి వివరించారు. కంప్యూటర్‌లో కానీ, స్మార్ట్ ఫోన్‌లలో కానీ తప్పనిసరిగా యాంటీ వైరస్ ద్వారా ప్రొటక్ట్ చేసుకోవాలని, అపరిచత కాల్స్, లింకులు, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, పర్సనల్ జీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, డీజీఎం(ఐటీ) కార్పొరేట్ శ్రీనివాస్‌రావు, ఐటీ మేనేజర్ రాజేష్, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.